క్లుప్తంగా

పెద్ద చెరువులో చేప పిల్లలు విడుదల



ధన్వాడ: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో ధన్వాడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలిపెట్టారు. జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు నీరటి నర్సిములు నాయుడు మాట్లాడుతూ ధన్వాడ సంఘం తరఫున చేపల పెంపకం కోసం రాజమండ్రి నుంచి తెచ్చిన రెండు లక్షల చేప పిల్లలను వదిలామని తెలిపారు. అంతకుముందు గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో చేపలు విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నారాయణ, రాములు, బాలరాజ్, భాస్కర్, చరణ్ దాస్, రాజు, సుధాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో సవరణ చేసుకోవాలి

మాగనూర్: ఓటర్ల జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సవరణలు చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని, అందుకు గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఓటరు తొలి జాబితా విడుదల చేశారు. తుది జాబితాకు గడువు ఉన్నందున, మండలంలోని ప్రతి గ్రామంలో ఓటర్లు సవరణలు చేసుకోవాలన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



మరికల్: మండల కేంద్రంలోని ఎనిమిదో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో బాలమ్మ, జయశ్రీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నారాయణపేట: జిల్లా సెర్ప్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సందప్ప, కార్యదర్శిగా గంగాధర్‌యాదవ్, కోశాధికారిగా సుమతిని నియమించారు. ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి, ముఖ్య సలహాదారులు, వర్కింగ్ అధ్యక్షులు, కార్యదర్శులు 11 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం వారు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మొగులప్పను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

ప్రపంచ శాంతి ర్యాలీ



మక్తల్: ప్రపంచ శాంతి ర్యాలీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నారాయణపేట జిల్లా సైక్లిలింగ్, షూటింగ్ బాల్ నిర్వాహకుడు విశ్రాంత పీఈటీ గోపాలం ఆధ్వర్యంలో పట్టణంలోని లిటిల్ ఏంజిల్ ప్రైవేటు ఉన్నత పాఠశాల నుంచి పురవీధుల గుండా విద్యార్థులు జాతీయ జెండాలను పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ప్రపంచంలోని అన్ని దేశాలు యుద్ధాలు, సరిహద్దు సమస్యలు లేకుండా సామరస్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జగదీష్‌కుమార్, నజ్మ, సల్మా, సమీనా, బుశ్రా, రాజేశ్వరి, మహిబోలీ, ఈశ్వరి, ఇందిర, సతీష్, అంబ్రేస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆరోగ్యం ముఖ్యం

ఆత్మకూర్: విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్, స్త్రీశిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారులు లక్ష్మమ్మ, జ్యోతి, నర్మద, శ్రీలత అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 2, స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ భీ పడాయిభీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రతిరోజు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు షకీల్‌అహ్మద్, చక్రపాణిరెడ్డి, గిరిధర్, అంజలన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



మాగనూర్‌లో పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

మాగనూర్: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నట్లు పీడీ రాకేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వలన శారీరక, మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. ముఖ్యంగా క్రీడలతో స్నేహభావాలు పెంపొందుతాయని తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సమానమని, నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది కావాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీడీఓ రహ్మతుద్దీన్ చేతుల మీదుగా బహుమతులను బహూకరించారు. మండలంలో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీధర్‌రెడ్డి, పీఈటీలు వాణి, మీనా, మధుసూదన్, నాయకులు వాసవి రాము, పుంజనూర్ అంజనేయులు, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: క్రీడల వల్ల విద్యార్థుల్లో మానసిక, శారీరక ఎదుగుదల ఉంటుందని తహసీల్దార్ రవి అన్నారు. శనివారం ఊట్కూరులో 68వ పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. 14 నుంచి 17 ఏళ్ల లోపు బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణంరాజు, పీడీ సాయినాథ్, వెంకటేష్, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎల్కోటి జనార్దన్ రెడ్డి, హనుమంతు, గోపాల్ పాల్గొన్నారు.



ఊట్కూరులో..

విధుల్లో నిర్లక్ష్యం తగదు



అమ్మపల్లిలో ఇంకుడుగుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

మాగనూర్: మండలంలోని అడవిసత్యవార్, అమ్మపల్లి పంచాయతీల్లో ఎంపీడీఓ రహ్మతుద్దీన్ శనివారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పంచాయతీ కార్యాలయాలతో పాటు పాఠశాలలను, అంగన్‌వాడీలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంకుడు గుంతల నిర్మాణాన్ని వేగంగా చేపట్టాలని సూచించారు. నర్సరీల్లోని మొక్కలను పరిశీలించి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని మొక్కలను నాటి సంరక్షించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ హర్షవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సహకారంతోనే విద్యార్థుల్లో సంపూర్ణ వికాసం



చిన్నపొర్ల పాఠశాలలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు



బాజాపూర్ ఉన్నత పాఠశాలలో..

నారాయణపేట: ఉపాధ్యాయుల కృషికి తల్లిదండ్రుల సహకారం ఉంటేనే విద్యార్థుల్లో సంపూర్ణ వికాసం సాధ్యమవుతుందని సెక్టోరియల్ అధికారులు నాగార్జునరెడ్డి, శ్రీనివాస్ అన్నారు. జాజాపూర్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం భారతి అధ్యక్షతన శనివారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పిల్లలను నిరంతరం పర్యవేక్షణ చేయడం, తగు సూచనలు ఇవ్వడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులకు మంచి పిల్లలు అనే చక్కని వీడియోను డిజిటల్ టీవీ ద్వారా చూపించి అవగాహన కల్పించారు.

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల, మల్లెపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, విద్యాబోధన, మౌలిక వసతులు తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా తల్లిదండ్రులు సహకరించాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మైనోద్దీన్‌అహ్మద్, గులాంరసూల్, కృష్ణ, అబ్జల్‌ఆహ్మద్ నజిరి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు



ధన్వాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గుండుమాల్‌లో..

కోస్గి: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కార్మికులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండుమాల్ పీహెచ్‌సీ వైద్యుల సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శశిధర్, పుర చైర్‌పర్సన్ అన్నపూర్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి కిష్టమ్మ, సిబ్బంది సౌందర్య, మణిమాల, శశిధర్‌రెడ్డి, కృష్ణవేణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 22 మంది సిబ్బందికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్‌తో పాటు ఇతర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిప్రకాష్, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, వైద్యాధికారి మునీర్‌అహ్మద్, ఎంపీహెచ్ఓ కతలప్ప, అశోక్‌కుమార్, నరేష్, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌యంఎస్ పాల్గొన్నారు..

గోటూర్‌లో..

మండలంలోని గోటూర్‌లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీకి ఘన నివాళి



ధన్వాడ: మాజీ మంత్రి కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ధన్వాడ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని భక్తమర్కండేయ స్వామి ఆలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేనేత సంఘం మండల అధ్యక్షుడు కెంచె బాల్‌రాజు మాట్లాడుతూ చేనేత కార్మికుల కోసం ఎనలేని సేవలను చేశారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి భారతరత్న అవార్డును ప్రదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బాలప్ప, శివాజీ, సురేందర్, నాగర్జున్, నర్సిములు, బాలయ్య, భాస్కర్, గోపీకృష్ణ, రంఘయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కలిసి ముందుకెళ్దాం

అమరచింత: పట్టణాభివృద్ధి కోసం కౌన్సిల్ సభ్యులతో కలిసి ముందుకెళ్లడమే కాకుండా నిధుల సేకరణ కోసం ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్ సహకారం తీసుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం పట్టణాభివృద్ధిపై చేపట్టాల్సిన కార్యక్రమాలను చర్చించేందుకు చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని 10 వార్డుల్లో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీలు, సీసీ రహదారుల నిర్మాణం కోసం నిధులు అవసరమన్నారు.

లీకేజీలపై ప్రత్యేక చర్యలు..

మిషన్ భగీరథ పైప్‌లైన్లు ఎక్కడ పడితే అక్కడ లీకేజీలు ఏర్పడ్డాయని, దీంతో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పైప్‌లైన్ల మరమ్మతును వెంటనే చేపట్టాలని ఏఈ రుక్మేందర్‌రెడ్డికి సూచించారు. వారం రోజుల లోపు పట్టణంలోని పూర్తి లీకేజీలను గుర్తించి వాటికి మరమ్మతులు చేపట్టాలని, లేనిపక్షంలో కలెక్టర్‌కు కౌన్సిల్ ద్వారా ఫిర్యాదు చేస్తామన్నారు.

వాటర్‌మెన్లను మార్చొద్దు..

పట్టణంలో తాగునీటిని సరఫరా చేస్తున్న వాటర్ లైన్‌మెన్లు తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. పలు వార్డుల్లో వాటర్ లైన్‌మెన్లను మార్చాలని తమ దృష్టికి వచ్చిందని, ఇకనుంచైనా వారు నిర్లక్ష్యం వీడాలని మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం హెచ్చరించారు. ఈ ఏడాది వరకు వారిని మార్చబోమన్నారు. సమావేశంలో మేనేజర్ మహ్మద్, కౌన్సిలర్లు మాధవి, లక్ష్మి, సింధు, ఉషారాణి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డబ్బాలు తొలగించాలని వినతి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కోస్గి: గుండుమాల్ మండల కేంద్రంలోని మటన్ మార్కెట్ ఆవరణలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న అక్రమ డబ్బాలను తొలగించాలని శనివారం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా ఆరెకటికలు మాంసం అమ్ముకొని జీవనం సాగిస్తున్నారని, అక్రమంగా డబ్బాలు వేసుకోవడంతో రోడ్లపై మాంసం విక్రయించాల్సి వస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో పలుమార్లు పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాపోయారు. ఈ విషయంలో తగు చర్యలు తీసుకొని అక్రమ డబ్బాలు తొలగించాలని కోరారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ పోలీసులు

నారాయణపేట: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని షీ టీమ్ పోలీసులు బాలరాజు అన్నారు. ఎస్పీ యోగేష్‌గౌతం ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. కాలేజీల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వల్ల విద్యార్థులు భయంతో సూసైడ్ చేసుకునే ప్రమాదం ఉందన్నారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలని, చాలా మంది విద్యార్థులు చదువులు మధ్యలో ఆపేయడంతో జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే పేట షీ టీం సెల్ నంబర్ 87126 70398 కు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే ప్రతిరోజు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీం పోలీసులు చెన్నయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్షేత్ర పర్యటన



ఆయిల్‌పాం తోటను పరిశీలిస్తున్న విద్యార్థులు

దామరగిద్ద: మండలంలోని జెడ్పీఉన్నత పాఠశాలకు చెందిన ఒకేషనల్ విద్యార్థులకు శనివారం క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లారు. ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్స్ శంభులింగం, శిరీష క్షేత్రస్థాయిలో ఫాంఆయిల్ సాగుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తక్కువ నీటితో మొక్కలను సంరక్షించేందుకు ప్రభుత్వ రాయితీతో అందిస్తున్న డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి తడులను అందించడాన్ని వివరించారు. మొక్కల సంరక్షణలకు డ్రిప్ ద్వారా సాగునీటితో పాటు సూక్ష్మ పోషకాలను అందించవచ్చని తెలిపారు. అనంతరం పాఠశాలలో ఐటీ సంబంధిత కంప్యూటర్ కోర్సులో నేర్చుకోవాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అనురాధ, పీఈటీ రమేష్ పాల్గొన్నారు.

30 ఏళ్ల ఆకాంక్ష నెరవేరింది



మాట్లాడుతున్న ఇటుక రాజు మాదిగ

మరికల్: ఎస్సీ వర్గీకరణ చేయాలని 30 ఏళ్ల నుంచి మాదిగ ఉప కులాలతో కలిసి చేసిన దండోరా ఉద్యమానికి నేడు ఫలితం దక్కిందని టీఎమ్మార్పీఎస్ పోరాట సమితి వ్యవస్థాపకుడు ఇటుక రాజుమాదిగ అన్నారు. శనివారం మరికల్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి పూజలు నిర్వహించి అక్కడి నుంచి ర్యాలీగా ఫంక్షన్‌హాల్‌కు చేరుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో పేద ఎస్సీలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇన్నాళ్లు మాదిగ ఉపకులాలు విద్యా, ఉద్యోగ రంగాల్లో నష్టపోయారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, గౌరవ అధ్యక్షుడు నర్సిములు, ఉపాధ్యక్షులు గండి బాలరాజు, ప్రధాన కార్యదర్శి జంగయ్య, అంజనేయులు, రామస్వామి, గోపి, రాము, కృష్ణయ్య, వెంకటయ్య, రాజు, జేమ్స్, ఎలుక బాలరాజు, శివకుమార్, బాలకృష్ణ, కుందేటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం



పీఆర్టీయూ టీఎస్ నూతన కార్యవర్గ సభ్యులు

మక్తల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామని పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, జనార్దన్‌రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు తిరుపతి అన్నారు. పీఆర్టీయూ టీఎస్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నికల పరిశీలకుడు రఘువీర్ ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా నిర్వమ/ంచారు. మండల అధ్యక్షుడిగా ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శి బాబు, మండల గౌరవ అధ్యక్షుడు అబ్దుల్ రహిమాన్, మండల అసోసియేట్ అధ్యక్షుడు ఆర్కే అశోక్, జి.లక్ష్మణ్, మండల అధికార ప్రతినిధి వెంకటష్, గురురాజు, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా నజీయాబేగం, ప్రసన్నకుమారి, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, రాజగోపాల్, హన్మంతుగౌడ్, వెంకట్‌రెడ్డి, రాములు, మహిళా ఉపాధ్యక్షురాలిగా చంద్రకళ, కార్యదర్శులుగా వివేకనందగౌడ్, ఆంజనేయులు, నరేష్, బాల్‌రాజ్, రాజేష్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, మహిళా కార్యదర్శి తిరుమల, కాంప్లెక్స్ ప్రతినిధులు హన్మప్పచారి, రాము తదితరులు పాల్గొన్నారు. అనంతరం పీఆర్టీయూ టీఎస్ మాజీ అధ్యక్షుడు మాలీపటేల్ శ్రీనివాస్‌రెడ్డిని, నూతన కార్యవర్గాన్ని శాలువతో సన్మానించారు.

పాఠశాలలో కంప్యూటర్ చోరీ

ఆత్మకూర్: పట్టణంలోని జాతర మైదానం బాలుర ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు కంప్యూటర్‌ను ఎత్తుకెళ్లిన ఘటన శనివారం చోటుచేసుకుంది. జీహెచ్‌ఎం విష్ణువర్ధన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్ తన సొంత డబ్బు రూ.లక్ష వెచ్చించి కంప్యూటర్‌తో పాటు ఇతర సౌకర్యాలను సమకూర్చారన్నారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కంప్యూటర్ ల్యాబ్ గది తాళాలు పగులగొట్టి అందులోని వస్తువులను చిందరవందర చేసి కంప్యూటర్‌తో పాటు విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారన్నారు. సమాచారం అందుకున్న ఎస్ నరేందర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు. ఇదివరకే పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారతమాత విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను ఐదేళ్లు గడుస్తున్నా పట్టుకోలేదని, ఇప్పటికైనా కంప్యూటర్‌ను దొంగలను పట్టుకుంటే భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

ఆత్మకూర్: కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరమేష్, రహ్మతుల్లా, తులసీరాజ్‌యాదవ్, నల్గొం శ్రీను అన్నారు. శనివారం స్థానిక అతిథి గృహంలో వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ విధానాలపై ప్రజల్లో రోజురోజుకూ అసహనం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజాపాలనను విస్మరించి కులమత విద్వేషాలు, ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలు, చివరకు వక్ఫ్ భూములను అమ్ముకునేందుకు పూనుకుంటుందని ధ్వజమెత్తారు. ఈనెల 23న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, బాలకిష్టాపూర్‌లో రూ.500లకు సిలిండర్ ప్రొసీడింగ్ కాపీ పంపిణీ ఉంటుందని, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

‘రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి’



ఖానాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్న కొండయ్య



నారాయణపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ శ్రేణులు

నారాయణపేట: అమెరికాలో దేశ విద్రోహ శక్తులతో కలిసి రాహుల్‌గాంధీ ప్రెస్‌మీట్‌లో భారతదేశం మీద అనుచిత వ్యాఖ్యలు చేయడం వెనకాల అంతరార్థం ఏమిటో చెప్పాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జ్ ఎద్ల కృష్ణన్న, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ప్రపంచ వేదికల మీద రాహుల్‌గాంధీ భారత్‌ను తక్కువగా చేసి మాట్లాడుతూ తప్పుడు ప్రచారం చేయడాన్ని నిరసిస్తూ శనివారం జిల్లా కేంద్రంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని అంటున్న రాహుల్ వ్యాఖ్యలు తప్పుపట్టారు. రాజ్యాంగానికి, అంత్యోదయ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. దళితులైన బంగారు లక్ష్మణ్‌ను పార్టీ జాతీయ అధ్యక్షుడిగా చేసిన ఘనత బీజేపీకి దక్కిందన్నారు. కార్యక్రమంలో ఆశప్ప, జిల్లా కార్యదర్శి గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్, కోశాధికారి సిద్ధి వెంకట్రాములు, పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య, నారాయణరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య నాయకులకు సూచించారు. మండలంలోని ఖానాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆయన ప్రారంభించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో బీజేపీకి బలమైన పునాదులు ఉన్నాయని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కర్నిస్వామి, మాజీ ఎంపీటీసీలు రంగప్ప, మండల అధ్యక్షుడు లక్ష్మణ్, నాగప్ప, రాములు, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని మందిపల్లిలో బీజేపీ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు గొల్ల నారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, శంకరోల్ల రవికుమార్, కనకరాజు, జయనంద్‌రెడ్డి, అశోక్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, గంప వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.